ఊరుగొండలో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరము..




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

ఉపాధి హామీ కార్మికుల సమక్షంలో విక్రమ్ జన్మదిన వేడుకలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 77 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 15 మార్చి 2026



## ఢిల్లీలో కట్టెల పొయ్యిలకు అనుమతి

**- కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న గ్యాస్ కొరతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా ఢిల్లీలో కట్టెల పొయ్యిల వాడకంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ మిగతా2లో...

# అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు

**● మరోమారు గరిష్ట విద్యుత్ సరఫరా ● అవసరాలను ఎదుర్కొనే సత్తా ఉందన్న భట్టి**



**హైదరాబాద్ మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ విద్యుత్ సంస్థలు చరిత్రలో ఒకే రోజున అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు విద్యుత్ సరఫరా చేసి రికార్డు సృష్టించింది. మార్చి 13 న ఉదయం 11:17 గంటలకు 18,228 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ను తట్టుకుని విజయవంతంగా సరఫరా చేసింది. మార్చి 13న తెలంగాణ విద్యుత్ వినియోగం చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. ఆ రోజున 341.08 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసి, గత రికార్డు 335.19 మిలియన్ యూనిట్లు (18.03.2025) ను అధిగమించింది. అదే విధంగా, 18,228 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ను కూడా విజయవంతంగా తీర్చింది. ఇది గతంలో నమోదైన 17,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ కంటే ఎక్కువ.ఉష్ణోగ్రతలు పెరగడం ,

మిగతా2లో...

## గ్రీన్‌కార్డు కోసం డ్రామా..

**- 11 మంది ఇండియన్స్ అరెస్టు**



**హైదరాబాద్ మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికాలో గ్రీన్‌కార్డు పొందడం కోసం చోరీ నాటకాలు ఆడిన 11 మంది భారతీయులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. 'యూ వీసా' పొందడానికి తాము నేర బాధితులమని నమ్మించే

మిగతా2లో...

## దేశంపై యుద్ధప్రభావం పడకుండా చర్యలు

**గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్**

**దేశ ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి**

**అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు**



**గౌహతి,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారం నాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 మిగతా2లో...



## తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

**కమర్షియల్ సిలిండర్లలో కొంత లోటు**

**సామాజిక మాధ్యామాల్లో దుష్ప్రచారం**

**ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్స్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష**

**ప్రజలు సంయమనంతో ఉండాలని సూచన**

**హైదరాబాద్ మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, కేవలం కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎల్పీజీ డిస్టిబ్యూటర్స్ అసోసియేషన్ , ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని చెప్పారు. అయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అవసరంగ లేకున్నా ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని ఉత్తమ్ సూచించారు. కావాలని గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని

మిగతా2లో...

## నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాల ఎంపిక

**తెలంగాణ నుంచి ములుగు జిల్లాకు అవకాశం**

**కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు**



**న్యూఢిల్లీ,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాల ఆర్థికాభివృద్ధికి క్రెష్ సెంటర్లు చాలా అవసరమని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల సంరక్షణ కోసం గ్రామాల్లో క్రెష్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం క్రెష్ సెంటర్ వర్కర్లకు రూ.5,000 మాత్రమే వేతనం ఉండటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోందని.. దీంతో వేతనాలు పెంచాలని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవిని కోరినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 1,000 క్రెష్ సెంటర్లు పనిచేస్తున్నాయని.. తక్కువ వేతనాల కారణంగా సిబ్బంది కొరత ఉందని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీతక్క శనివారం కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మహిళలు, బాలికల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. నిర్భయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు కార్యక్రమాన్ని చేపట్టింది. నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాలను ఎంపిక చేసింది. ఈ జాబితాలో తెలంగాణ మిగతా2లో...



## శ్రీశైలంలో గవర్నర్ శుక్లా దంపతలు పూజలు

**- రుద్రాభిషేకం, కుంకుమార్చనలో పాల్గొన్న గవర్నర్**


**- కన్నడ భక్తుల రాకతో కిటకిటలాడుతున్న క్షేత్రం**

**శ్రీశైలం,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శనివారం తెల్లవారు జామున తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు ఆలయ మిగతా2లో...

## టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యం

**- డిజిటల్ ఎకానమికి సాంకేతిక సహకారం**

**- మంత్రి శ్రీధర్ బాబుతో టాంజానియా బృందం భేటీ**



**హైదరాబాద్ మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజిటల్ ఎకానమీగా మారాలన్న టాంజానియా లక్ష్యానికి సాంకేతిక సహకారం అందించడానికి తెలంగాణ ముందుకు వచ్చింది.

మిగతా2లో...

## పాడేరులో జనసేన ఆవిర్భావ వేడుకలు

**ఓనూరులో పార్టీ జెండాను ఆవిష్కరించిన పవన్**

**థింసా నృత్యంతో స్వాగతం పలికిన గిరజన మహిళలు**

**పార్టీ ఆవిర్భావం సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ అభినందనలు**



**పాడేరు,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో పర్యటిస్తున్నారు. ఓనూరు నుంచి నందిగరువుకు కాలినడకన వెళ్లారు. అనంతరం రోడ్డు పనులు పరిశీలించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఓనూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పవన్ వెంట పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అరకు పార్లమెంటు ఇంఛార్జి గంగులయ్య, నేతలు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు. పవన్‌కు స్థానిక మహిళలు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. పవన్ సమక్షంలో

మిగతా2లో...



## తెలంగాణలో టెన్త్ పరీక్షలు ప్రారంభం

**- అరగంట ముందుగానే కేంద్రాలకు అనుమతి**

**హైదరాబాద్,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు

మిగతా2లో...

## బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర

**కరీంనగర్ మహాలశక్తి ఆలయం నుంచి కొండగట్టుకు**

**స్థానిక కార్పోరేటర్లతో కలసి పదివేలమంది నడక**

**రాజకీయాలకు సంబంధం లేదన్న కేంద్రమంత్రి**

**కొండగట్టును అభివృద్ధి చేస్తామని హామీ**



# పాడేరులో జనసేన ఆవిర్భావ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

పలువురు జనసేనలో చేరారు. వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓనూరులో అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం అందించారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జనసేన పోషిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్ కోసం పనిచేస్తున్న జనసైనికులకు, వీరమహిళలకు, నేతలకు సీఎం శుభాభినందనలు తెలిపారు. పవన్‌కు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఏడు సిద్ధాంతాలతో ప్రజాజీవితాల్లో భాగం కావడం సంతోషమన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సుందరపు విజయ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్ తదితరులు పవన్‌ను కలిసి స్వాగతం పలికారు. తరవాత హెలికాప్టర్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరుకు బయలుదేరారు పవన్. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పర్యటన జరగనుంది. పాడేరు నియోజకవర్గం నందిగరువు గ్రామంలో




గిరిజనుల మధ్య ఈ వేడుకలు నిర్వహించనున్నారు. పాడేరులో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి, ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద 'అడవితల్లి బాట' పేరిట నిర్మించిన రహదారులను డిప్యూటీ సీఎం పరిశీలించనున్నారు. ఆపై నిర్మాణం పూర్తయిన రహదారులను పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. అనంతరం గిరిజనులతో 'మాటా–మంతి' కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను తెలుసుకుని చర్చించనున్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.

# దేశంపై యుద్ధప్రభావం పడకుండా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

కోట్లతో సిల్చార్–మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు. ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైందని విమర్శించారు. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలు బొమ్మగా మారిందని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పు పట్టారు. మోదీని దూషించడం, అబద్దాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమ వుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుంద న్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడంతప్ప..వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.

# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. ఎల్పీజీ ఆయిల్ సరఫరా సంస్థలతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్..' ప్రస్తుత పరిస్థితులపై నిన్న అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాం. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్టిబ్యూటర్ లు ఉన్నారు. 1.3 కోట్ల డోమాస్టిక్ కన్జుమర్స్ ఉన్నారు. 7.5 లక్షల కమర్షియల్ కన్జుమర్స్ ఉన్నారు. నెలకు యావరేజ్ 60 లక్షల సిలిండర్లు డొమెస్టిక్ వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలోనే కొరత ఏర్పడుతోంది. డొమస్టిక్ కన్జుమర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదు. ఆందోళనతో ముందస్తుగా అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారు. గృహ అవసర సిలిండర్లకు కొరత లేదు. కమర్షియల్ సిలిండర్లను కేంద్రం 20 శాతం సప్లై చేస్తోందన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రానికి లేఖ రాశాం. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమాస్టిక్ సిలిండర్లు సప్లై చేస్తారు. నిన్న మొన్న 2.3 లక్షలు సప్లై చేశారు. కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23 వేలు సప్లై చేసే వాళ్లు. కానీ ప్రస్తుతం 6200 సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు. స్కూల్స్, కాలేజెస్, సెంటర్, స్టేట్ గవర్నమెంట్ సంస్థలకు కమర్షియల్ సిలిండర్లు విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. సివిల్ సప్లై భవన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని. ఎవరైన కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా..బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ఫ్ లైన్ 180042500344 కు కాల్ చేయొచ్చని' మంత్రి ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు.


గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, అక్రమ నిల్వలను అరికట్టేందుకు రాష్ట్ర , జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. గృహ అవసరాల సిలిండర్లు పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మొత్తానికి, సామాన్యుడి వంటింట్లో మంట ఆరిపోకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.

# బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర

**కరీంనగర్,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొండగట్టును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు మహా పాదయాత్ర చేపట్టారు. కేంద్ర మంత్రితో పాటు ఇటీవల గెలుపొందిన కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం భాజపా కైవసమైతే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటానని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, 10 వేల మంది కార్యకర్తలతో కలిసి సంజయ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కొండగట్టు పాదయాత్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'అంజన్న ఆశీర్వాద' పేరుతో శనివారం మహా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కరీంనగర్ మహాశక్తి అమ్మవారి దేవాలయం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతోంది. సాయంత్రం కొండగట్టుకు ఈ పాదయాత్ర చేరుకోనుంది. బీజేపీ శ్రేణులు ఈ పాదయాత్రకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పది వేలమంది పాల్గొనేలా ఎ÷–లాన్ చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. కొండగట్టు అంజన్న ఆశీర్వాదం, ప్రజల ఆశీర్వాదంతో కరీంనగర్ కార్పొరేషన్‌లో విజయం సాధించామని పేర్కొన్నారు. మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు ఈ పాదయాత్ర చేస్తున్నామని బండి సంజయ్ వివరించారు. పదోతరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పాదయాత్ర కొనసాగుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నది ఎన్డీయే భాగస్వామ్య ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ ఎన్డీయే కూటమి మిత్రుడేనని తెలిపారు. కొండగట్టు అభివృద్ధికి టీటీడీ నిధులను పవన్ కల్యాణ్ కేటాయించారని ప్రస్తావించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కొండగట్టు అభివృద్ధిని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రసాదం స్కీమ్ కింద కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేస్తామని కేసీఆర్ హయాంలో చెప్పారని.. కానీ చర్యలు మాత్రం చేపట్టలేదని ఆగ్రహించారు. ఎంఐఎంను తాము భూస్థాపితం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. 'సర్వేజన సుఖీనోభవంతు మా నినాదం' అని చెప్పుకొచ్చారు. తుంగతుర్తి ఎమ్మెల్యే బ్రాహ్మణుల మీద మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని ఆరోపించారు. హిందువుల గురించి అనుచితంగా మాట్లాడే పరిస్థితి కాంగ్రెస్ సర్కార్‌లో వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మళ్లీ ఎలా గెలిస్తారో చూస్తామని హెచ్చరించారు. తుంగతుర్తిలో ఆయన పతనం ప్రారంభమైందని ధ్వజమెత్తారు.

# టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)




టాంజానియా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై సహకారం పెంచాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. టాంజానియాలో ఫార్మా డిస్టిబ్యూషన్ హబ్ ఏర్పాటు చేసే అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. తెలంగాణ 'మీ సేవ' మోడల్ ద్వారా పౌర సేవల డెలివరీ విధానంపై మార్గదర్శకత్వం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'వీ హబ్' ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కల్పించే అంశంపై చర్చించారు. స్కిల్లింగ్, రీ–స్కిల్లింగ్, అప్ – స్కిల్లింగ్ రంగాల్లో కూడా సహకారం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'త్వరలో తెలంగాణతో ఎంవోయూ కుదుర్చుకుంటాం. ఈ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది' అని టాంజానియా మంత్రి ప్రకటించారు.

# ఢిల్లీలో కట్టెల పొయ్యిలకు అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. గ్యాస్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా క్టటెల పొయ్యిల వాడకానికి అధికారికంగా అనుమతి నిచ్చింది. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని తగ్గించే ఉద్దేశంతో గతంలో క్టటెల పొయ్యిలు, బొగ్గు వాడకంపై కఠినమైన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం నెలకొన్న గ్యాస్ కొరత కారణంగా సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించిన కేంద్రం, ఈ నిబంధనలను సడలిస్తూ నిర్ణయం తీసుకుంది. ఎల్‌పీజీ లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు వంట కోసం ఇబ్బంది పడకుండా ఈ వెసులుబాటు కల్పించారు. గ్యాస్ సంక్షోభం నుంచి ఉపశమనం పొందే వరకు ఈ అనుమతి వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు. కట్టెల పొయ్యిలకు అనుమతి ఇచ్చినప్పటికీ, కాలుష్యం మరీ పెరగకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వం సూచించింది. వీలైనంత వరకు పొగ తక్కువగా వచ్చే పద్ధతులను పాటించాలని కోరింది. కేవలం నివాస అవసరాలకు మాత్రమే ఈ అనుమతి ఉంటుంది. బహిరంగంగా పెద్ద ఎత్తున కాల్చడంపై ఆంక్షలు కొనసాగుతాయి. కేంద్రం నిర్ణయం పట్ల ఢిల్లీలోని మధ్యతరగతి, దిగువ తరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ ధరలు పెరగడం, పైగా కొరత ఉండటంతో క్టటెల పొయ్యిలు ఇప్పుడు పెద్ద ఊరటనిస్తాయని భావిస్తున్నారు.

# గ్రీన్‌కార్డు కోసం డ్రామా.. 11 మంది ఇండియన్స్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. అమెరికాలో నేరాలకు బాధితులై, విచారణకు సహకరిస్తే 'యూ నాన్ ఇమ్మిగ్రెంట్ స్టేటస్' (యూ వీసా) లభిస్తుంది. ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తూ వీరు ఈ నాటకానికి తెరలేపినట్లు ఫెడరల్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు.

# శ్రీశైలంలో గవర్నర్ శుక్లా దంపతులు పూజలు

(మొదటి పేజీ తరువాయి)

మర్యాదలతో స్వాగతం పలికారు. గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గవర్నర్ దంపతులకు దేవస్థానం అర్చకులు, పండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో వారికి స్వామి అమ్మ వార్ల చిత్రపటాలను అందజేశారు. శ్రీశైల క్షేత్ర విశేషాల గ్రంథాన్ని గవర్నర్‌కు ఈవో బహూకరించారు. గవర్నర్‌గా నియమితులు అయ్యాక శుక్లా శుక్రవారం శ్రీశైలం చేరుకున్నారు. వేకువ జామునే ఆయన ఆలయం చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇదిలావుంటే శ్రీశైలంలో భారీగా రద్దీ పెరగింది. వరు సెలవులకు తోడు కన్నడ భక్తుల రాకతో శ్రీశైలం కిటకిటలాడుతోంది.


# తెలంగాణలో టెన్త్ పరీక్షలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్నాయి. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 2676 కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన పరీక్షా కేంద్రాలలోనికి అనుమతిస్తామని అధికారులు చెప్పారు. పలు కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్‌ది బెస్టు చెబుతూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు.

# హరీష్ రావును కలిసిన శారదాపీఠం ఉత్తరాధికారి

## - ఆలయంలో ఉగాది ఉత్సవాలకు ఆహ్వానం



**హైదరాబాద్,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వచ్చిన స్వామిజీ.. ఆయనకు ఆశీస్సులు అందజేశారు. కోకాపేట నియోపోలిస్‌లోని శ్రీ రాజశ్యామల దేవస్థానంలో ఈ నెల 19న జరగనున్న ప్రభవ నామ సంవత్సర ఉగాది ఆస్థానం, అలాగే 27న జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాల్సిందిగా హరీశ్ రావును స్వామిజీ సాదరంగా ఆహ్వానించారు. శ్రీ రాజశ్యామల అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా హరీశ్ రావు మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

# అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ అవసరాలు అధికమవడం వల్ల విద్యుత్ అవసరం, గరిష్ట లోడ్ రెండూ పెరిగాయి. రాబోయే రోజుల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తూ కొనసాగుతాయి. రోజుకు 350కు పైగా మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం. సుమారు 19,000 మెగావాట్ల గరిష్ట లోడ్ ను నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. బలమైన విద్యుత్ గ్రిడ్ ,సమన్వయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికతో ఈ అవసరాలను ఎదుర్కొనే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది అని డిప్యూటీ సీఎం అన్నారు.

# నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాల ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ములుగు జిల్లాను ఎంపిక చేయడంపై మంత్రి సీతక్క ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.నిర్భయ నిధి కింద ములుగు జిల్లాకు రూ.10 కోట్లు విడుదల చేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. త్వరలో రాష్ట్రంలో 15,000 అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 2,000 అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపడుతున్నామని, అంగన్వాడీ మౌలిక వసతుల కోసం బ్జడెట్‌లో రూ.100 కోట్లు కేటాయించామని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పాలతో పాటు త్వరలో బ్రేక్‌ఫాస్ట్ కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రిటైర్డ్ అంగన్వాడీ టీచర్లకు రూ.2 లక్షల వరకు బెనిఫిట్లు అందిస్తున్నామని.. కేంద్రం నుంచి అంగన్వాడీ వేతనాల్లో పెంపు అవసరమని మంత్రి సీతక్క వెల్లడించారు.

# రంజాన్ పండుగ సందర్భంగా 5 రోజుల ప్రత్యేక సెలవులు ప్రకటించాలి

**• తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ తాజొద్దీన్**

**(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి మార్చి 14):** ముస్లింల అత్యంత పవిత్రమైన పండుగ రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్) సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఐదు రోజుల ప్రత్యేక సెలవులు ప్రకటించాలని తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ తాజొద్దీన్ ఒక ప్రకటన లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంజాన్ పండుగ ముస్లింలకు ఎంతో ముఖ్యమైనదని, ఈ పండుగను తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామాల్లో జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారని తెలిపారు.పండుగ ప్రయాణాలకు సమయం అవసరం ఉంటుందని,ఉద్యోగ, ఉపాధి కారణాల వల్ల నగరాల్లో నివసిస్తున్న వేలాది మంది ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకోవడానికి తమ తమ స్వగ్రామాలకు వెళ్లాల్సి ఉంటుందని, కేవలం ఒక్క రోజు సెలవుతో ఇది సాధ్యం కాదని పేర్కొన్నారు.దసరా, సంక్రాంతి పండుగల సందర్భంగా సెలవులు ఇచ్చినట్లే, రంజాన్ పండుగకు ముందు రెండు రోజులు మరియు పండుగ తర్వాత రెండు రోజులు కలిపి మొత్తం ఐదు రోజుల సెలవులను అధికారికంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే పేద, మధ్యతరగతి కార్మికులు మరియు ఉద్యోగులకు ఈ సెలవులు ఎంతో ఉపశమనంగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు.అంతేకాకుండా, తెలంగాణలోని గంగాజమున తహజీబ్ సంప్రదాయానికి అనుగుణంగా అందరికీ సమాన గౌరవం ఇవ్వడం అవసరమని, మైనార్టీల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని మొహమ్మద్ తాజొద్దీన్ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు.



# ఉపాధి హామీ కార్మికుల సమక్షంలో విక్రమ్ జన్మదిన వేడుకలు





**పరకాల, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు గుండెబోయిన విక్రమ్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ఉపాధి హామీ కార్మికులు, గ్రామ ప్రజల సమక్షంలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి నాగారం గ్రామ మాజీ సర్పంచ్, పరకాల మాజీ పీఏసీఎస్ చైర్మన్ గుండెబోయిన నాగయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఏరుకొండ రమాదేవిశ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఏరుకొండ సంతోష్, వార్డు సభ్యులు తూముల ప్రవీణ్, జాలిగపు రాజు, తిరుపతి, గొట్టె అనిల్, పైడిపాల శ్రీధర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని విక్రమ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గుండెబోయిన విక్రమ్ మాట్లాడుతూ తన తండ్రి గుండెబోయిన నాగయ్య గ్రామ సర్పంచ్‌గా, పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేసి ప్రజల కోసం నిరంతరం కృషి చేసి ప్రజాదరణ పొందారని తెలిపారు. అదే స్ఫూర్తితో తాను కూడా గ్రామ ప్రజలకు సేవ చేయాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నానన్నారు. యువత, మహిళలు, గ్రామ ప్రజలు తక్కువ సమయంలోనే తనను యువ నాయకుడిగా ఆదరించి మీ ఇంటి బిడ్డగా గుర్తింపు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.పుట్టినరోజు సందర్భంగా సుమారు 200 మంది ఉపాధి హామీ కార్మికులకు పండ్లు, చల్లా పంపిణీ చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తన లక్ష్యమని విక్రమ్ పేర్కొన్నారు. రైతులు, శ్రమజీవులు, నిరుపేదలకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యలపై స్పందించే యువ నాయకుడిగా విక్రమ్ సేవలను గ్రామస్తులు ప్రశంసించారు.

# ఊరుగొండలో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరము..








**హనుమకొండ : మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రమదానం తోనే అభివృద్ధి సాధ్యం:– శ్రమదానంతో గ్రామాల అభి వృద్ధి చేసుకునే అవగాహన పెంపొందించుకోవాలని సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. నేడు దామర మండలం ఊరుగొండ గ్రామంలో కాకతీయ ప్రభుత్వ కళాశాల అటానమస్ హనుమకొండ వారు నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిర సమావేశం ప్రారంభమైనది. ఈ సమావేశము జిల్లా పరిషత్ హై స్కూల్ ఊరుగొండ నందు జరిగినది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవాభావాన్ని కొనియాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీమతి రజిని లత మాట్లాడుతూ కాకతీయ ప్రభుత్వ కళాశాల అటానమస్ హనుమకొండ వాలంటీర్లు ఊరుగొండ గ్రామాన్ని ఎంపిక చేసుకోవడం, ఏడు రోజులు సమాజంలో ఉన్న సమస్యలను అవగాహన చేసుకోవాలని తెలియజేశారు .ముఖ్య వక్తగా విచ్చేసిన మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కే సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎన్ఎస్ఎస్ దోదపడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులలో దాగివున్న సాంస్కృతిక ప్రతిభను ఎన్ఎస్ఎస్ వేదిక ద్వారా నిరూపించుకోవచ్చు అన్నారు .ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 , యూనిట్ 3 ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ బి సీతారాం మాట్లాడుతూ మార్చి13 నుండి మార్చి 19 వరకు తమ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరము నిర్వహిస్తుందని తెలిపారు. కళాశాల ×ూజ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ గ్రామానికి విచ్చేసిన వాలంటీర్లు మంచి సేవా భావం పెంపొందించుకొని సమాజానికి సేవ చేయాలన్నారు .అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్లో స్వచ్ఛభారత్ నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డాక్టర్ గణపతి ,గ్రామ ఉపసర్పంచ్ నంద్యాల శ్రావణ్ రెడ్డి ,వార్డు సభ్యులు ,వాలంటీర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర గోశాల సంపర్క్ ప్రముఖ ఊటుకూరి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో




**గంగాధర మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు గంగాధర శనివారపు వారసంత లోని పశువుల వైద్యాధికారి గ్రామ పంచాయితీ కార్యదర్శిలు లేకుండా 1977 గోరక్షణ చట్టాన్ని అతిక్రమించి నిబంధనలు ఉల్లంగించి పశువులను క్రయవిక్రయాల జరుపుకున్నారు. దేశి గో వంశ లక్షణ సంవర్ధన సమితి విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర గోశాల సంపర్గా ప్రముక్ ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో పశువుల వార సంతను పరిశీలించారు.. పశువైద్యాధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శి వారసంతలో ఉపస్థితి లేకపోవడం, ప్రేయవేటు వ్యక్తుల సమక్షంలో పశువుల కొనుగోలు అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై పశువుల వైద్యాధికారి, గ్రామపంచాయతీ సెక్రెటరీ, సంబంధిత కాంట్రాక్టర్ను వివరణ కోరగా కాంట్రాక్టర్ దురుసుగా ప్రవర్తించాడు. దీనిపై గంగాధర పోలీసు స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేసినాము. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బస్తీ ముఖ్య శిక్షక్ జోగిని పెల్లి సంజీవరావు, భారతీయ కిసాన్ సంగ్ నాయకులు పోరెడ్డి సంజీవరెడ్డి, బిజెపి నాయకులు కర్ర ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

# ఏటూరునాగారంలో పుట్ట రూపంలో వెలిసిన ఎల్లమ్మ తల్లి ఆలయ స్లాబ్ పనుల ఘన ప్రారంభం





**ఏటూరునాగారం,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారంలో పుట్ట రూపంలో స్వయంభూగా వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణంలో కీలక ఘట్టం ప్రారంభమైంది. స్థానిక రామాలయం సమీపంలో వెలిసిన ఈ పవిత్ర పుట్టను గ్రామస్తులు ఎన్నో సంవత్సరాలుగా శక్తి స్వరూపంగా భావించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి మహిమపై విశ్వాసంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరచుగా వచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు.ఈ నేపథ్యంలో అమ్మవారికి శాశ్వతంగా ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో చేపట్టిన నిర్మాణ పనులు ఇప్పుడు వేగంగా కొనసాగుతున్నాయి. నేడు ఆలయ ప్రధాన మండపానికి స్లాబ్ వేసే పనులను ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు దంపతులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

**ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్** గత సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామ అభివృద్ధితో పాటు ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు దంపతులు కృషి చేస్తున్నారు. ఆలయ నిర్మాణ బాధ్యతను స్వయంగా తీసుకుని దశలవారీగా పనులు చేపడుతూ ముందుకు తీసుకెళుతున్నారు. ఈ రోజు ఆలయ ప్రధాన మండపానికి స్లాబ్ పనులు ప్రారంభించడం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది.

**పుట్ట రూపంలో వెలిసిన అమ్మవారి మహిమ** ఏటూరునాగారంలో పుట్ట రూపంలో వెలిసిన ఎల్లమ్మ తల్లి మహిమ చుట్టుపక్కల గ్రామాల్లో విశేషంగా ప్రచారంలో ఉంది. ఈ పుట్టను గ్రామస్తులు పవిత్రంగా భావించి సంవత్సరాలుగా పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు సౌకర్యంగా దర్శనం చేసుకునేలా, మొక్కులు చెల్లించుకునేలా ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఆలయం పూర్తయితే గ్రామానికి ఆధ్యాత్మికంగా మరింత ప్రాధాన్యం ఏర్పడుతుందని గ్రామ పెద్దలు తెలిపారు.

**ఆలయ అభివృద్ధికి దంపతుల కృషి** సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు దంపతులు స్వయంగా ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళుతున్నారు. స్లాబ్ పనుల ప్రారంభానికి ముందు పుట్ట వద్ద ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి గ్రామానికి శ్రేయస్సు కలగాలని ప్రార్థించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆలయ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి త్వరలోనే భక్తులందరికీ అందుబాటులోకి తీసుకువస్తామని వారు తెలిపారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులు** ఈ కార్యక్రమంలో రామాలయం గుడి చైర్మన్ అల్వాల శ్రీనివాస్, దన్నపు నేని కిరణ్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చంద్రబాబు, వార్డు సభ్యులు కొండాయి చిన్ని, రామాలయం గుడి కమిటీ సభ్యులు కత్తెర శ్రీను, కాకులమర్రి అరుణ, దీనబంధం స్వామి అయ్యగారు, జాడి బోజారావు, దాసరి బుజ్జయ్య, చిత్తు బొత్తుల సదానందం, బ్రహ్మం, పెండాల సంతోష్, ఎర్రల ఎల్లయ్య, గుడిమెట్ల కనకతార, వెలకంటి శ్రీను, బాల్య రాజేష్, కుమ్మరి నరేష్, కుమ్మరి రాజు, సంతోష్, నాగరాజు, కొండాయి రాజు, నరసింహులు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అడవికి నిప్పు పర్యావరణానికి ముప్పు

**• లక్ష్మీదేవిపేట సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్**



**ములుగు,మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** లక్ష్మీదేవిపేట వెంకటాపూర్ మండలం ములుగు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామములో అటవీ శాఖ ఆధ్వర్యములో చేపట్టిన అడవిలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యల పై అవగాహన కార్యక్రమము నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ వంశావతి మాట్లాడుతూ అడవిలో నిప్పుడ పర్యావరణానికి ముప్పు.. అడివి సంరక్షణ సమస్త జీవకోటి పరిరక్షణ అన్న నినాదంతో అవగాహన అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అడవి ప్రాంతాల్లో నేలపై ఆకులు ఎండినా, తుప్పలు వాటి అంతట అవే కుళ్లి నేలపై సారముల ఏర్పడతాయని వాటిని, కాల్చి బూడిద చేయరాదని చెప్పారు. అటవీ ప్రాంతాల్లో కాల్చిన సిగరెట్, బీడీలు, మంటలకు సహకరించే వస్తువులు పడేయా రాదని ఆమె అన్నారు తేనె, చీపుర్లు మొదలగు అటవీ ఉత్పత్తులు సేకరించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో బిట్ ఆఫీసర్ రూప్ కుమార్ తో వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పేదల వైద్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి





**మానకొండూర్,మార్చ్14(పీసీడబ్ల్యూ న్యూస్):** నిరుపేదల వైద్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శనివారం పెద్ద లింగాపూర్ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో వైద్యఆరోగ్యశాఖ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మారుమూల గ్రామాలకు ఈ శిబిరాలను మరింత విస్తరింపజేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేదల వైద్యాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించడమే కాకుండా అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నదన్నారు. అలాగే ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులతోపాటు వైద్యేతర సిబ్బందిని నియమిస్తున్నదని ఆయన గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ జీవన, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జి.వసంత-నర్సయ్య,పార్టీ నాయకులు ఊట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య,ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ఎల్లందుల ప్రసాద్, రాజేందర్ రెడ్డి, నవీన్ రెడ్డి, పసుల వెంకటి, మామిడి రాజు తదితరులు పాల్గొన్నారు. **వల్లంపట్లలో...**వల్లంపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన అంగన్ వాడీ కేంద్ర భవనానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో వల్లంపట్ల గ్రామ సర్పంచ్ నేరేళ్ల విజయ్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు ఉట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య, పార్టీ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ఎలగందుల ప్రసాద్, పసుల వెంకటి, కాత మల్లేశం, మామిడి రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **జవహర్ పేటలో:** ఇల్లంతకుంట మండలం జవహరిపేట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాంపెల్లి నాగరాజుతోపాటు పలువురు పంచాయతీ వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 4 వార్డు పనులు పరిశీలన**

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**




**కల్లూరు, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మున్సిపల్ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్మట్టా రాగమయి దయానంద్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో నాలుగో వార్డ్ లో నిర్వహించిన అభివృద్ధి పనులను సత్తుపల్లి శాసనసభ్యులు రాగమయి పరిశీలించారు. ముఖ్యంగా 4వ వార్డులో జరుగుతున్న మార్గదర్శక పనులను స్వయంగా పరిశీలించి, అధికారులతో చర్చించారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో భాగంగా, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమం ద్వారా రోడ్లు, డ్రైనేజీ, వాటర్ సప్లై వంటి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది అని అన్నారు. 4వ వార్డులో జరుగుతున్న పనులు అద్భుతంగా సాగుతున్నాయనీ అన్నారు. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలి అని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి సూచనలను గమనించుకుని, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు , మున్సిపల్ కమిషనర్ ఎం రామ దుర్గారెడ్డి, మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, శీలం కృష్ణారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఉస్మాన్, మండల యూత్ అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహారావు, 4 వార్డు కౌన్సిలర్స్ భూక్య రాంబాయి, 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, జిల్లా యూత్ నాయకులు ధరావత్ రవికుమార్, వార్డ్ ఆఫీసర్స్, స్థానిక నాయకులు మున్సిపాలిటీ సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పేదల ఆత్మగౌరవం పెంపునకే ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి




**తిమ్మాపూర్,మార్చి14(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రతి పేదవాడు...ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చెస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శనివారం తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలో పార్నంది శ్రీలత-శ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాకుండా వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తున్నామని ఆయన చెప్పారు. అర్హులైన వారందరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మాణాలు చేపట్టని వారిని గుర్తించి వారి స్థానంలో అర్హులైన ఇతరులను ఎంపిక చేస్తామని ఆయన చెప్పారు. ప్రగతిలో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోరండ్ల గ్రామ సర్పంచు అనోది శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ పోరండ్ల గ్రామశాఖ అధ్యక్షుడు చింతల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చింతల లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు మామిడి అనిల్ కుమార్,పోలు రాము, రమేశ్, జనార్దన్ రెడ్డి, బొజ్జ రవి, గడ్డం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. **సితార రెస్టారెంట్ ప్రారంభం** తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని సుభాష్ నగర్ లో నూతనంగా నెలకొల్పిన సితార రెస్టారెంట్ ను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. రెస్టారెంట్ యజమాని రొండ్ల నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధగోని లక్ష్మినారాయణగౌడ్, మోరపల్లి రమణారెడ్డి, శ్రీగిరి రంగారావు, మామిడి అనిల్ కుమార్, నందికొండ తిరుపతిరెడ్డి ,కొమ్మెర మల్లారెడ్డి, భూతం నర్సయ్య, తూర్పాటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటి నుండి కొండగట్టు దాకా పాదయాత్ర చేసిన చేసిన బిజెపి బూత్ అధ్యక్షులు చిందం అంజి..



**కరీంనగర్,మార్చి14(పీసీడబ్ల్యూ న్యూస్):** బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ శనివారం రోజున తలపెట్టిన అంజన్న ఆశీర్వాద యాత్ర కోసం శ్రీ మహాశక్తి దేవాలయానికి బిజెపి శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. శ్రీ మహాశక్తి దేవాలయం నుండి ప్రారంభమైన ఈ మహా పాదయాత్ర కొండగట్టు దాకా కొనసాగింది. అయితే కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ ఆలుగునూరు పరిధిలోని (శ్రీ వెంకటేశ్వర కాలనీ) 133 పోలింగ్ బూత్ అధ్యక్షులు చిందం అంజి శనివారం రోజున జరిగిన అంజన్న ఆశీర్వాద యాత్ర కోసం ఇంటి నుంచే పాదయాత్ర మొదలుపెట్టారు. అలుగునూరుకు శివారులో ఎల్ఎండి కాలనీకి సమీపంలో నివసించే చిందం అంజి ఉదయాన్నే స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామిని దర్శించుకొని అక్కడినుండి పాదయాత్రగా శ్రీ మహాశక్తి దేవాలయానికి వచ్చారు. తదనంతరం మహాశక్తి దేవాలయం నుండి ప్రారంభమైన యాత్రలో పాల్గొని కొండగట్టు దాకా పాదయాత్ర చేసి అంజన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి పోలింగ్ బూత్ అధ్యక్షులు చిందం అంజి మాట్లాడుతూ కరీంనగర్ మేయర్ పీఠం బిజెపి కైవసం చేసుకుంటే పాదయాత్రతో వచ్చి ఆంజనేయ స్వామి మొక్కు తీర్చుకుంటానని ప్రకటించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అడుగులో అడుగు వేయాలనే ఉద్దేశంతో ఇంటి నుంచే పాదయాత్ర మొదలుపెట్టడం జరిగిందని తెలిపారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు: జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి




**ములుగు జిల్లా,మార్చి14(పీసీడబ్ల్యూ న్యూస్):** నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అయిన నేపథ్యంలో ములుగు జిల్లాలో 20 పరీక్షా కేంద్రాలలో 3290 మంది విద్యార్థులకు గాను 3286 మంది విద్యార్థులు హాజరు అయ్యారని, 04గురు విద్యార్థులు అనుపస్థితి కాగా పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి గారు తెలిపారు. జిల్లాలో 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరియు డీఈఓ గారు 15 పరీక్షా కేంద్రాలను సందర్శించారని ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదని వారు తెలిపారు. విద్యార్థులు ఒక పరీక్షకు మరొక పరీక్షకు మధ్య ఉన్నటువంటి రోజులలో పాఠశాలకు విధిగా హాజరై తదుపరి పరీక్షకు సిద్ధం కావాలని, ఉపాధ్యాయుల సలహాలు పర్యవేక్షణలో ఉత్తమ మార్కుల సాధనకు కృషి చేయాలని అన్నారు.

## అంజన్న ఆశీర్వాదయాత్ర కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్




**గంగాధర మార్చ్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు కరీంనగర్ నుండి కొండగట్టుకు పాదయాత్ర అంజన్న ఆశీర్వాద యాత్రలో ఎండను లెక్క చేయకుండా బండి సంజయ్ తో కలిసి అడుగులేస్తున్న కాషాయ సైన్యం. పాదయాత్రలో అడుగడుగునా మంచినీళ్లు, మజ్జిగను అందుబాటులో ఉంచిన స్వచ్ఛంద సంస్థలు, బీజేపీ శ్రేణులు. గంగాధర లో మండల ఆర్యవైశ్య సోదరులందరూ ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేసినారు. భక్తి పారవశ్యంతో జై హనుమాన్...జై శ్రీరాం అంటూ ముందుకు సాగుతున్న "అంజన్న ఆశీర్వాద యాత్రఆద్యంతం ఆధ్యాత్మిక యాత్రను తలపిస్తూ కాషాయ జెండాలతో రెపరెపలాడుతున్న అంజన్న ఆశీర్వాద యాత్ర రాజకీయాలతో సంబంధం లేకుండా పూర్తి భక్తి పాటలు, ఆధ్యాత్మిక వాతావరణంలోనే కొనసాగుతున్న బండి సంజయ్ పాదయాత్ర.

## కాంగ్రెస్‌లో చేరిన జంగపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్...



**గన్నేరువరం,మార్చి14(పీసీడబ్ల్యూ న్యూస్):** గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామ సర్పంచ్ తాడూరి కరుణశ్రీ వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ మహంకాళి ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఎల్ఎండి కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే వారితోపాటు వార్డు సభ్యులు ఇరుమాండ్ల ఎల్లేష్ , అలువాల ప్రదీప్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గన్నేరువరం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరితో కలిసి పనిచేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, పార్టీ నాయకులు అలువాల కోటి, నందికొండ తిరుపతిరెడ్డి, మోరపల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పశువులకు గాలి కుంటు టీకాలు తప్పనిసరి: డా : ఉజ్వల



**పినపాక, మార్చి14(పీసీడబ్ల్యూ న్యూస్):**పశువులను గాలి కుంటు (ఎఫ్ఎండీ) వ్యాధి నుంచి రక్షించేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని వెటర్నరీ వైద్యురాలు డాక్టర్: ఉజ్వల తెలిపారు. శనివారం పినపాక మండలం ఇ బయ్యారం గ్రామంలో నిర్వహిస్తున్న గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పశువుల ఆరోగ్య పరిరక్షణలో టీకాల ప్రాముఖ్యతను వివరించారు. గాలి కుంటు వ్యాధి వ్యాప్తి చెందితే పశువులకు తీవ్ర నష్టం కలుగుతుందని, పాల ఉత్పత్తి కూడా తగ్గిపోతుందని చెప్పారు. అందువల్ల ప్రతి రైతు తమ పశువులకు సమయానికి టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి పాలన సూర్యాపేట తెలంగాణ సాంస్కృత సారధి టీం లీడర్ వేముల శ్రవణ్



**సూర్యాపేట మార్చి14 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరూ ప్రజా పాలనలో సుభిక్షంగా సురక్షంగా ఉంటున్నారని సూర్యాపేట జిల్లా తెలంగాణ సాంస్కృత సారధి టీం లీడర్ వేముల శ్రవణ్ అన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు అందుబాటులో ఉంచుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేసే దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తుందని మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, పేదలకు సన్నబియ్యం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం, నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు, తదితర అంశాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి సూర్యాపేట జిల్లా వేముల శ్రవణ్ కళాబృందంచె ఆటపాటల ద్వారా కోదాడ నియోజకవర్గం, మునగాల మండలం నేలమర్రి గ్రామంలో ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కళారూపాల ద్వారా అవగాహన కల్పించడం జరిగిందని శ్రవణ్ తెలిపారు.గ్రామ ప్రజలు, కళాకారులు టీం లీడర్ వేముల శ్రవణ్, వెన్నెల నాగరాజు, చల్లా లక్ష్మి, ఈర్ల సైదులు, వేణు,ప్రియాంక, శిరీష,స్రవంతి, ప్రియదర్శిని,ఇంద్రజ పాల్గొన్నారు.

## హరి బోలి డివిజన్ యువ నాయకుడు రాకేష్ గైక్వాడ్ ఆధ్వర్యంలో ఘనంగా కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ మార్చి 14(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడే ధైర్యవంతురాలు మహిళా శక్తికి ప్రతీక ప్రజల కోసం సేవ చేసే నాయకురాలు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా హరి బోలి డివిజన్ తెలంగాణ జాగృతి యువ నాయకులు రాకేష్ గైక్వాడ్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని, కవిత ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం చేస్తు, అన్ని వర్గాల ప్రజల ఆదరణ లభిస్తున్న సందర్భంగా మహిళ ధైర్యానికి ప్రతిరూపం తెలంగాణ గౌరవానికి ప్రతీక, పదవులు వచ్చినా పోయిన ప్రజల కోసం చేసే సేవా ఎప్పటికీ నిలిచి పోతుందని ప్రజల గుండెల్లో ఆదరణతో ముందుకు వెళుతున్న కల్వకుంట్ల కవిత కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని కవిత ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం పురోగతి సాధిస్తుందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి యూత్ వింగ్ అల్వాల జితేందర్, బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ ఏల్కొండ రామకోటి, ఎస్టీ సెల్ నాయకుడు రాంజీ నాయక్, తెలంగాణ జాగృతి హైదరాబాద్ అధ్యక్షులు మహేందర్ ముదిరాజ్, తెలంగాణ జాగృతి వ నాయకులు హర్ష అస్తానా, శ్రీకర్, రాజు తారకేశ్వరి నేత ,రాజ్ కుమార్, ఓంకార్ స్వామి, నందాల అనిల్ కుమార్, నితీష్, నిఠై భూషణ్ రాయ్, అస్థాన, రూప్ సింగ్, సచిన్, శశి, పల్లవి ముఖేష్, రాహుల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## హైదరాబాద్, మియాపూర్‌లకు నాన్‌స్టాప్ ఏసీ బస్సులు

- ప్రతి 45 నిమిషాలకు నాన్‌స్టాప్ ఏసీ రాజధాని బస్సు
- ఖమ్మం డిపో మేనేజర్ మేడా శివప్రసాద్



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఖమ్మం నూతన బస్టాండ్ నుండి హైదరాబాద్, మియాపూర్ తదితర ప్రాంతాలకు ఏసీ రాజధాని నాన్‌స్టాప్ బస్సులు, సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు ఖమ్మం డిపో మేనేజర్ మేడా శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు ప్రతి 45 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ ఏసీ రాజధాని బస్సు నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి మియాపూర్‌కు ఏసీ బస్సులు ఉదయం 3.15 గంటలకు, మధ్యాహ్నం 12.30 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు, సాయంత్రం 6.40 గంటలకు, రాత్రి 11.15 గంటలకు నడుస్తాయి. అలాగే మధ్యాహ్నం 3.00 గంటలకు బెంగుళూరుకు ఏసీ లహరి స్లీపర్ బస్సు కూడా అందుబాటులో ఉందని తెలిపారు. అదేవిధంగా ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ ఏసీ రాజధాని బస్సులు ఉదయం 4.00 గంటల నుంచి రాత్రి 10.45 గంటల వరకు ప్రతి 45 నిమిషాలకు నడుస్తాయి. అలాగే హైదరాబాద్ నుంచి ఖమ్మంకు కూడా ఇదే విధంగా ఉదయం 4.15 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు నాన్‌స్టాప్ ఏసీ రాజధాని బస్సులు తిరుగు ప్రయాణం చేస్తాయని వెల్లడించారు. అదనంగా ఖమ్మం నుంచి శ్రీశైలం వరకు రాత్రి 12.15 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు నడుస్తుండగా, విశాఖపట్నంకు ఉదయం 7.30 గంటలకు, సాయంత్రం 7.00 గంటలకు, రాత్రి 9.00 గంటలకు సూపర్ లగ్జరీ బస్సులు నడుస్తున్నాయి. అలాగే ఉదయం 9.00 గంటలకు ఏసీ రాజధాని బస్సు కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సురక్షితమైన, సుఖవంతమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఆయన సూచించారు. టికెట్ రిజర్వేషన్ కోసం ఖమ్మం బస్ స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌ను సంప్రదించవచ్చని, లేదా ఆన్‌లైన్‌లో www.tgsrtcbus.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు పొందవచ్చని ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ తెలిపారు.

## ఇఫ్తార్ విందులు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయి..
# మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి

**- ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్**




**కరీంనగర్,మార్చి14(పీసీడబ్ల్యూ న్యూస్):** ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయంది... గంగా జమున తెహజీబ్ కు ప్రతిరూపంగా మారుతాయని ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ అన్నారు. శనివారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు, ఎంఐఎం పార్టీ కరీంనగర్ ఆధ్వర్యంలో ఆమెర్ నగర్, షాసాహబ్ మొహాళ్లలోని మధు గార్డెన్ లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ కు, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు అలుగునూర్ బ్రిడ్జి వద్ద ఘన స్వాగతం పలికారు, ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు ఖర్జూర వండ్లు, డ్రైఫ్రూట్స్ ఏర్పాటు చేసి రోజును విరమింపజేశారు. ఈసందర్భంగా రహ్మత్ బేగ్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని, హిందూ ముస్లిం ఐక్యతకు మారుపేరుగా నిలుస్తాయన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో అల్లాహ్ మెప్పు కోసం నెల రోజుల పాటు కఠోర మైన ఉపవాస దీక్షలు పాటించి, నెల రోజులు ఖురాన్ పారాయణం, తరావీహ్ నమాజ్ క్రమం తప్పకుండా ఆచరించి పుణ్య ఫలాలు పొందడం గొప్ప ధార్మిక సంకల్పమని కొనియాడారు. సనిషి జీవితంలో సంపాదన, డబ్బు కంటే ఆధ్యాత్మిక చింతనే ముఖ్యమన్నారు. ఏడాదిలో 11 నెలలు తమ కోసం, ఒక నెల రమాజన్ మాసం మొత్తం అల్లాహ్ కోసం కేటాయించి, చిన్న తప్పు చేయకుండా, చెడుకు దూరంగా ఉండి పవిత్రమైన ఉపవాస దీక్షలు పాటించడం అంటే ఏకేశ్వరుడైన అల్లాహ్ కరుణా కటాక్షములు పొందడమేనన్నారు. అనంతరం ఇస్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ కు పూలమాలలు, శాలువాతో ఇస్లామీయ సాంప్రదాయ బద్ధంగా ఎంఐఎం నాయకులు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ దావాతే ఇఫ్తార్ విందుకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 3వేల మందికి పైగా హాజరై విజయవంతం చేశారు. హాఫిజ్ యూసుఫ్ నమాజ్ ముగ్రిబ్ చదివించగా, మౌలానా అలీముద్దీన్ నిజామి, మౌలానా ఘుఫ్రాన్ దుఆ చేశారు. ఈకార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్పొరేటర్ హుస్సేనీ పాషా, మాజీ డిప్యూటీ అబ్బాస్ సమీ, జగిత్యాల ఎంఐఎం అధ్యక్షుడు ఖాజా లియాఖత్ అలీ మొహసీన్, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, ఆతిన, కోశాధికారి ఇబ్రహీం, కార్పొరేటర్లు మొహసీన్ మొహియుద్దీన్, మాజిద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్లు అరిఫ్ అహ్మద్, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, నాయకులు అజర్ దబీర్, ఖాజా మజారొద్దీన్, అంజద్ ఖాన్, సాజిద్, వాజిద్ అలీఖాన్, షబ్బీర్, గాలి రాజు, అన్నేమల్ల సురేష్, సుధాకర్, తాజుద్దీన్, కోరుట్ల మాజీ కౌన్సిలర్ సాబేర్ అలీ, ఎంఐఎం అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం ముందుండే ప్రజా నాయకుడు పెడకంటి రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**ఆపదలో ఆదుకునే సహాయ హస్తం బీఆర్ఎస్ నాయకుడు పెడకంటి రామకృష్ణ సేవలకు ప్రశంసలు**

**నిరాడంబర జీవనం.. ప్రజా సేవే లక్ష్యం పెడకంటి రామకృష్ణ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు**






**కల్లూరు, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలిచే సహాయ గుణం కలిగిన వ్యక్తిగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, కల్లూరు మండల యువజన విభాగం అధ్యక్షుడు, కల్లూరు మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ పేరు స్థానికంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. న్యూ ప్రతాప్ ల్యాబ్ అధినేతగా కూడా సేవలందిస్తూ సమాజానికి దగ్గరగా ఉండే నాయకుడిగా ఆయన నిలుస్తున్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పని చేసే నాయకుడిగా, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేసే వ్యక్తిగా రామకృష్ణకు మంచి పేరు ఉంది. తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్యకు ఆయన ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తున్నారు. 18వ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర, యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించడం వంటి అంశాల్లో రామకృష్ణ ఎప్పుడూ ముందుంటారు. ప్రజల సమస్యలు తెలిసిన వెంటనే స్పందించి పరిష్కారం కోసం కృషి చేయడం ఆయన ప్రత్యేకతగా స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి సేవాభావం కలిగిన నాయకుడు పెడకంటి రామకృష్ణ జన్మదినం సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సమేతంగా ఆయురా రోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవిం చాలని, భవిష్యత్తులో మరిన్ని



విజయాలు సాధించి ప్రజా సేవలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ప్రజల సేవనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రామకృష్ణ వంటి నాయకులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పలువురు అభిప్రాయపడ్డారు. ఆయన జీవితంలో ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుంటూ ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.

## స్మశాన వైకుంఠం ఇబ్బందులు పడుతున్న ఏటూరునాగారం ప్రజలు







**ఏటూరునాగారం,మార్చి 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల పరిధిలో ఉన్న స్మశాన వైకుంఠం వాటిక వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్మశానవాటిక అభివృద్ధి కోసం నిర్మించిన ఈ ప్రదేశంలో నీటి సదుపాయం లేకపోవడం వల్ల అంత్యక్రియల సమయంలో ప్రజలు చాలా కష్టాలు పడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్మశానవాటిక వద్ద తాగునీరు గానీ, శుభ్రపరచడానికి అవసరమైన నీటి సౌకర్యం గానీ లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో ఇబ్బందులు మరింత ఎక్కువవుతున్నాయని వారు చెబుతున్నారు. సమీపంలో ఉన్న వాగు వద్ద నీళ్లు ఉన్నప్పటికీ అది చాలా దూరంలో ఉండటం వల్ల అక్కడికి వెళ్లడం కూడా కష్టంగా మారిందని తెలిపారు.ప్రత్యేకంగా వృద్ధులు, మహిళలు, అంత్యక్రియలకు వచ్చిన బంధువులు నీటి కోసం దూరంగా వెళ్లాల్సి రావడంతో తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. స్మశానవాటిక వద్ద శుభ్రత కూడా సరిగా లేకపోవడంతో అక్కడికి వచ్చే ప్రజలు మరింత ఇబ్బంది పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.గ్రామ ప్రజలు మాట్లాడుతూ స్మశానవాటిక వద్ద తక్షణమే శుభ్రత చర్యలు చేపట్టాలని, అలాగే నీటి సదుపాయం కోసం వాటర్ మోటార్ పంపు ఏర్పాటు చేసి నల్లాలు (ట్యాపులు) ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో నీటి అవసరం అత్యంత ముఖ్యమైనదని, కానీ అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడం బాధాక రమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి స్మశాన వైకుంఠం నిర్మించినప్పటికీ, కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రజలకు ఉపయోగం లేకుండా పోతుందని గ్రామ పెద్దలు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి స్మశానవాటికలో నీటి సౌకర్యం, శుభ్రత మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరతలేదు..



**ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దు..**

**హాస్టల్స్, హాస్పిటల్స్‌లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం..**

**జిల్లాలో సరిపడా నిల్వలు..**

**యధావిధిగానే సరఫరా జరుగుతుంది..**

**సిలిండర్లను బ్లాక్ లో విక్రయిస్తే కఠిన చర్యలు..**

**పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా వ్యవహరిస్తాం: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**జిల్లాలో గ్యాస్ సరఫరా పై సమీక్షించేందుకు డిస్టిక్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు..**

**జిల్లా కలెక్టర్ చైర్మన్, డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీసర్ కన్వీనర్ గా 12 మంది సభ్యులతో కమిటీ..**

**జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు సంబంధించి ఎలాంటి కొరత లేదని ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు జిల్లా,మార్చి 14(పిసిడబ్ల్యూ న్యూస్):** శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో జిల్లాలో గ్యాస్ సరఫరాపై పోలీసు సివిల్ సప్లై, రవాణా, విద్య ఆరోగ్య శాఖ తోపాటు ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులను అధికారులతో అడిగి తెలుసుకొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లకు సంబంధించి జిల్లాలో ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళు గురుకులాలు పాఠశాలల్లో గ్యాస్ సరఫరా లో సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి హాస్టలు పాఠశాల గురుకులాలను సందర్శించి పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్లో అవసరమయ్యే గ్యాస్ కు సంబంధించి వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ జరపాలన్నారు. ఆస్పత్రుల్లో గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వైద్య శాఖ అధికారులు ప్రత్యేకంగా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎవరైనా గ్యాస్ సిలిండర్ల ను కృత్రిమ కొరత సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. పోలీసులు రవాణా శాఖ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బ్లాక్లో విక్రయించకుండా పోలీస్ అధికారులు నిరంతరం నిఘా పెట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు సాగునీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరా పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్ డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీసర్ కన్వీనర్ గా 12 మంది అధికారులతో కలిసి డిస్టిక్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్, డీఈవో, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్టీ డెవలప్మెంట్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఆఫీసర్ డిస్టిక్, డిఎం అండ్ హెచ్ ఓ, సేల్స్ మేనేజర్ హెచ్పీసీఎల్ బిపిసిఎల్ ఎల్పిజి డీలర్స్ సభ్యులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ కమిటీ గ్యాస్ సరఫరా ఇబ్బందులపై పర్యవేక్షణ జరుపుతుందన్నారు. జిల్లా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ లను కమర్షియల్ గా వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. 13వ తేదీన జిల్లాలో కమర్షియల్ గా వాడుతున్న 11 డొమెస్టిక్ సిలిండర్ లను అధికారులు సీజ్ చేశారని తెలిపారు. అదేవిధంగా 8 కేసులు నమోదు చేశారని చెప్పారు. గ్యాస్ సరఫరా పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. యధావిధిగా విధిగా ఎప్పటిలాగానే గ్యాస్ సరఫరా జరుగుతుందని స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 లోసంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై ఆఫీసర్ షా ఫైజల్ హుస్సేనీ, జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు, వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, డిస్ట్రిబ్యూటర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

# ఖమ్మం స్తంభాద్రి ఆలయ చైర్మన్‌గా డా. కూరపాటి ప్రదీప్ బాధ్యతల స్వీకారం





**ఖమ్మం, ప్రతినిధి మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కు నూతన ఛైర్మన్‌గా డా. కూరపాటి ప్రదీప్‌కుమార్ శనివారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి సమత, దేవస్థానం ఈవో జగన్మోహనరావు సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డా. ప్రదీప్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ సంప్రదాయాలను పరిరక్షిస్తూ దేవస్థానం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శన ఏర్పాట్లు కల్పించడంతో పాటు ఆలయ పరిసరాల అభివృద్ధి, పారిశుధ్యం, భక్తులకు అవసరమైన సేవా సౌకర్యాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. స్తంభాద్రి దేవస్థానం రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలలో ఒకటిగా గుర్తింపు పొందిందని, భక్తుల విశ్వాసాన్ని మరింత పెంచేలా ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శన వ్యవస్థను మెరుగుపరచడం, ఆలయ పరిసరాలను మరింత అందంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, వేద పండితులు, భక్తులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. కూరపాటి ప్రదీప్‌కుమార్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

# కౌన్సిలర్ ఉబ్బన రాంబాబుకు ఘన సన్మానం

- **ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్ష**
- **16వ వార్డు కౌన్సిలర్ రాంబాబుకు పట్టు శాలువాలతో సత్కారం**
- **ప్రజల ఆశీస్సులతో సేవలు కొనసాగిస్తా కౌన్సిలర్ రాంబాబు**



**కల్లూరు, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు కౌన్సిలర్‌గా ఇటీవల ఎన్నికైన ఉబ్బన రాంబాబును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నోటి కృష్ణారెడ్డి దంపతులు తన గృహములో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు రాంబాబుకు పట్టు శాలువ కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నోటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని పొందుతూ కౌన్సిలర్‌గా ఎన్నిక కావడం రాంబాబు సేవాభావానికి నిదర్శనమని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ మంచి ప్రజాప్రతినిధిగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు మరింత సేవ చేయాలని వారు అభిలషించారు. ఈ సందర్భంగా 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసం ఎంతో గొప్పదని అన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ పదవిని ఒక బాధ్యతగా భావించి తమ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజలు తనపై చూపిన ప్రేమ, ఆదరణను జీవితాంతం మరిచిపోనని పేర్కొన్నారు. తనను గెలిపించిన ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటానని, వార్డు అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని రాంబాబు స్పష్టం చేశారు. వార్డులో ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులతో పాటు మున్సిపల్ పాలకవర్గంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని చెప్పారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కౌన్సిలర్ రాంబాబుకు అభినందనలు తెలిపారు.

# పేదవాడి కల నిజం చేసిన ఇందిరమ్మ ఇల్లు : ఎమ్మెల్యే మట్టా రాగమయి

- **కాంగ్రెస్ పాలనలో**

**పేదలకు గృహ సౌభాగ్యం**





**కల్లూరు, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. కల్లూరు మండల పరిధిలోని ఓబుల్‌రావు బంజర గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ మాలోత్ అనురాధ నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సొంత ఇల్లు లేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా గృహనిర్మాణం కల్పించడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. ప్రతి అర్హుడైన పేద కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. లబ్ధిదారులు భూక్యా లక్ష్మి, కేశ్య మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పూరి గుడిసెలో నల్లపట్ట వేసుకుని పసిపిల్లలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొని గృహప్రవేశం చేయడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. తమకు సహాయం చేసిన ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజా ప్రభాకర్ చౌదరి, ముచ్చవారం సర్పంచ్ శీలం కోటమ్మ, జమలయ్య, గ్రామ సెక్రటరీ వాసం శ్రావణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

---

# మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్ విందు'

**క్రమశిక్షణ, దానగుణం, సహనం, ఆధ్యాత్మికత రంజాన్ మాసం ప్రత్యేకత**

**టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు**








**ఖమ్మం ప్రతినిధి, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్ విందు' అని టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. క్రమశిక్షణ, దానగుణం, సహనం, ఆధ్యాత్మికతను మనుషుల జీవితాల్లో పెంపొందించే పవిత్ర కాలమే రంజాన్ మాసమని ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) ఖమ్మం జిల్లా అధ్యక్షకార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి ల ఆధ్వర్యంలో టీజీవో కార్యాలయంలో శనివారం ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఈ జేఏసీ సెక్రటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ... రంజాన్ మాసం కేవలం ఉపవాసం ఉండే నెల మాత్రమే కాదని, మనసును పవిత్రం చేసుకుని ఆత్మశుద్ధి పొందే మహత్తరమైన ఆధ్యాత్మిక కాలమని వివరించారు. ఈ పవిత్ర మాసంలోనే దివ్య ఖురాన్ భూమిపై అవతరించిందని, అందుకే ముస్లిం సోదరులు రంజాన్ మాసాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో పాటిస్తారని తెలిపారు. సూర్యోదయానికి ముందు చేసే 'సెహరి' నుండి సూర్యాస్తమయం తరువాత చేసే 'ఇఫ్తార్' వరకు ఆహార పానీయాలను తీసుకోకుండా ఉపవాసం ఉండటం ద్వారా మనసుపై నియంత్రణ, క్రమశిక్షణ పెరుగుతాయని అన్నారు. మన దగ్గర ఉన్న సంపదలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయడం ద్వారా మానవత్వం పరిమళిస్తుందని పేర్కొన్నారు. ఆకలి విలువ తెలుసుకున్నప్పుడే తోటివారి ఆకలిని తీర్చాలనే భావన కలుగుతుందని ఆయన అన్నారు. కోపాన్ని దూరం చేసి అందరితో ప్రేమగా మెలగడం, పరస్పర గౌరవం పెంపొందించడం రంజాన్ పండుగ ప్రధాన సందేశమని ఆయన వివరించారు. ఈ పండుగ సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యతను బలపరుస్తుందని తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఇఫ్తార్ విందుల్లో పాల్గొనడం భారతీయ సంస్కృతికి గొప్ప నిదర్శనమని అన్నారు. అల్లాహ్ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటూ ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు భక్తిశ్రద్ధలతో నమాజ్, దువ నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, గంగవరపు నరేందర్, ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ బి. విజయకుమార్, టీజీవో మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొనిదెన శ్రీనివాసరావు, టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు వెంకన్న, దుర్గాప్రసాద్, తాళ్లూరి శ్రీకాంత్, ఏలూరి కోనేర్, నాలుగో తరగతి సంఘ అధ్యక్షులు బిక్కు నాయక్, కాంపాటి వెంకటరమణ, డ్రైవర్ సంఘ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు షేక్ అస్లాం, సయ్యద్ జిలాని, హలీం, ఎండి ముజాహిద్, ఎం.ఏ. గౌస్, తాజుద్దీన్, జహీరుద్దీన్, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు జి. పుల్లయ్య, శేఖర్, యుటిఎఫ్ అధ్యక్షులు రంజాన్ అలీ, డాక్టర్ రమేష్ బాబు, పరిషిక పుల్లయ్య, మేదరమెట్ల సుబ్బయ్య, కళ్యాణ నాగేశ్వరరావు, షేక్ మన్సూర్, వెంకటరావు, వై. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మట్టిదంద రోజూరోజూకు విపరీతం.... అటవీశాఖ చర్యలే అనుమానాస్పదం



● మీడియా కథనాల తర్వాతే అధికారుల కదలికలు ● జేసీబీ, ట్రాక్టర్లు పట్టుకోక కేసు ఒక్కరిపై మాత్రమే ● "వివరాలు సేకరిస్తున్నాం" అంటూ అధికారుల సమాధానం ● సంఘటనా స్థలానికి వెళ్లేసరికి వాహనాలు వెళ్లిపోయాయంటున్న మరో అధికారి ● అటవీ శాఖ కంటికి కనిపించని 6 ట్రాక్టర్లు, జేసీబీ ● వాహనాలు పట్టుకోకపోవడంపై మండలంలో తీవ్ర సందేహాలు ● మట్టి దందాకు అధికారుల అండదండలున్నాయా అని సందేహాలు? ● ముడుపుల ఆరోపణలతో వేడెక్కిన వ్యవహారం ● జరిమానాతో సరిపెట్టారనే స్థానికుల విమర్శలు ● అటవీ చట్టాల అమలుపై ప్రశ్నలు ● అడవిలో యథేచ్ఛ తవ్వకాలుడ పర్యవేక్షణ ఎక్కడ? ● ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న మండల ప్రజలు ● ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాతే కదలికలు

**ఏటూరునాగారం, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో జేసీబీ, ట్రాక్టర్లతో అక్రమంగా మట్టి తవ్వి తరలించిన ఘటనపై వార్తలు వెలువడిన తర్వాతే అటవీశాఖ కదిలినట్లు కనిపిస్తోంది. మీడియా ద్వారా విషయం బయటకు వచ్చిన అనంతరం అధికారులు సంఘటనను గుర్తించినప్పటికీ తీసుకున్న చర్యలపై మండల వ్యాప్తంగా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. భారీ యంత్రాలతో అడవిని తవ్వి మట్టిని తరలించిన ఘటనలో కీలకమైన జేసీబీ, ట్రాక్టర్లను పట్టుకోకుండా కేవలం ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశామని చెప్పడం పై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.**"వివరాలు సేకరిస్తున్నాం".. అధికారుల సమాధానం**ఈ ఘటనపై జూఎష దినపత్రిక ప్రతినిధి అటవీ శాఖ అధికారులను పలుమార్లు సంప్రదించి వివరణ కోరగా, అటవీ అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) రమేష్ "వివరాలు సేకరిస్తున్నాం" అని మాత్రమే సమాధానం ఇచ్చారు. మరోవైపు నార్త్ జోన్ అటవీ పరిధి అధికారి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు.అయితే మట్టిని తరలించిన ట్రాక్టర్లు, జేసీబీలను ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించగా "మేము వెళ్లేసరికి అవి వెళ్లిపోయాయి" అని చెప్పడం అధికారుల పనితీరుపై మరిన్ని సందేహాలను పెంచుతోంది. ముందుగానే సమాచారం అందించినప్పటికీ కీలక వాహనాలను పట్టుకోలేకపోవడం ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**6 ట్రాక్టర్లు, జేసీబీ కనిపించలేదా?**ఈ ఘటనలో సుమారు 6 ట్రాక్టర్లు, ఒక జేసీబీ యంత్రంతో రిజర్వ్ ఫారెస్ట్ నుంచి మట్టిని తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ కీలక యంత్రాలను పట్టుకోకుండా కేవలం ఒక వ్యక్తిపై కేసు నమోదు చేయడంపై మండల వ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మట్టి దందాకు అటవీశాఖలోని కొంతమంది అధికారుల అండదండలు మెండుగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో వాహనాలను పట్టుకోకుండా ఉండేందుకు సంబంధిత శాఖలోని కొందరు అధికారులకు ముడుపులు అందాయనే అనుమానాలు బహిరంగంగానే వ్యక్తమవుతున్నాయి. అందుకే చర్యలు కేవలం నామమాత్రంగా



జరిగాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జరిమానా ₹1,00,000తో సరిపెట్టారా?ఢ అటవీ చట్టాల అమలుపై ప్రశ్నలురిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో జేసీబీ, ట్రాక్టర్లతో మట్టి తవ్వి తరలించడం భారత అటవీ చట్టం1927, అటవీ సంరక్షణ చట్టం1980, తెలంగాణ అటవీ చట్టం1967 ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది.ఇలాంటి ఘటనల్లో వాహనాలను స్వాధీనం చేసుకోవడం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం వంటి నిబంధనలు ఉన్నప్పటికీ ములుగు జిల్లాలో మాత్రం అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.భారీ యంత్రాలతో అడవిలో తవ్వకాలు జరిగినా చివరకు జరిమానాతో సరిపెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ సంరక్షణ బాధ్యత వహించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అడవులు రక్షణ లేకుండా పోతాయని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే ఉన్నతాధికారులు దృష్టి



సారించి పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమ మట్టి దందాకు పాల్పడిన వారితో పాటు సహకరించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రముఖుల సమక్షంలో రామకృష్ణ జన్మదిన వేడుకలు

**ఘనంగా కౌన్సిలర్ రామకృష్ణ బర్త్‌డే సెలబ్రేషన్స్**

**శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**

**సేవా దృక్పథంతో ముందుకు సాగాలి**

**రామకృష్ణకు నాయకుల ఆకాంక్ష**

**కల్లూరు, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు కౌన్సిలర్, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు పెడకంటి రామకృష్ణ జన్మదిన వేడుకలు ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలలో వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, కల్లూరు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు ఇస్మాయిల్, దార్ల నరసింహారావు పాల్గొని రామకృష్ణను అభినందించారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల కృష్ణ, కొరకొప్పు ప్రసాద్, కాటేపల్లి రజినీకాంత్, నాగిరెడ్డి, రాచమల్ల



నాగేశ్వరరావు, గుర్రం శ్రీనివాసరావు, కట్ట ఆర్లప్ప, కరెంట్ కిరణ్ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రామకృష్ణ ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పనిచేస్తూ మంచి ప్రజాప్రతినిధిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.జన్మదిన సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో ప్రజాసేవలో మరింత కృషి చేస్తానని తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ములుగులో జూదంపై ఎస్సై 2 చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడులు



**ములుగు, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో జూదం నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. ములుగు 2వ ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జంగాలపల్లి, బంజారుపల్లి గ్రామాల శివారు ప్రాంతాల్లో శనివారం దాడులు చేపట్టారు.ఈ దాడుల్లో బంజారుపల్లి శివారు ప్రాంతంలో జూదం ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా జంగాలపల్లి శివారు ప్రాంతంలో ఇద్దరిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1,520 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరో నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి అక్కడి నుంచి పరారయ్యారు.ఈ ఘటనలపై సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి వారిని కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ములుగు ఎస్‌ఎచ్‌ఓ యు. ఉపేందర్ రావు మాట్లాడుతూ జూదం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. జూదం, గంజాయి వంటి నిషేధిత కార్యకలాపాల వల్ల అప్పులు, కుటుంబ కలహాలు, ఆత్మహత్యలు వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు తగిన పారితోషికం కూడా అందజేస్తామని తెలిపారు.

## ఏటూరునాగారంలో ట్రాఫిక్ సమస్య తీవ్రం.. ప్రజల ఆవేదన

**వై జంక్షన్ నుంచి సాయిబాబా దేవాలయం వరకు రహదారిపై రద్దీ**

**ఆక్రమణలతో రోడ్డు విస్తీర్ణం తగ్గి వాహనదారులకు ఇబ్బందులు**

**త్రిబుల్ రైడింగ్, అజాగ్రత్త డ్రైవింగ్‌తో ప్రమాద భయం**

**ఏటూరునాగారం, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వై జంక్షన్ నుంచి సాయిబాబా దేవాలయం వరకు రహదారి ఇరువైపులా ఉన్న దుకాణాలు, తాత్కాలిక షెడ్లు కారణంగా బాటసారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. **గ్రామపంచాయతీపై విమర్శలు** ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పటికీ సమస్యల పరిష్కారంలో సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పంచాయతీలో తీర్మానాలు తీసుకుంటున్నప్పటికీ అవి అమలులోకి రావడం లేదని ఆరోపిస్తున్నారు.**రహదారిపై ఆక్రమణలే ప్రధాన కారణం** వై జంక్షన్ నుంచి సాయిబాబా గుడి వరకు రహదారి పక్కన ఉన్న దుకాణాలు, తాత్కాలిక షెడ్లు రోడ్డు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. దీంతో వాహనాలు సరిగా వెళ్లలేకపోతున్నాయి. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది.**త్రిబుల్ రైడింగ్ అజాగ్రత్త డ్రైవింగ్** సాయంత్రం సమయాల్లో కొంతమంది యువకులు బైకులపై త్రిబుల్ రైడింగ్ చేస్తూ వేగంగా చక్కర్లు కొడుతున్నారని స్థానికులు అంటున్నారు.







డ్రైవింగ్‌పై సరైన అవగాహన లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను గమనించకుండా నిర్లక్ష్యంగా బైకులు నడపడం వల్ల చిన్నపిల్లలు, బాటసారులు భయంతో నడవాల్సి వస్తోందని చెబుతున్నారు. **బాటసారులకు తీవ్ర ఇబ్బందులు** రోడ్డు పక్కన నడిచే వారికి సరైన స్థలం లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.**అధికారులు స్పందించాలన్న డిమాండ్** మండల కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారి ఆక్రమణలను



తొలగించి, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బందికి డ్రెస్‌కోడ్ పంపిణీ

**వలిగొండ, మార్చి 14 (పిసిడబ్ల్యూ న్యూస్):**

గ్రామపంచాయతీ సిబ్బందికి డ్రెస్ కోడ్‌ను 4వ వార్డు సభ్యుడు లిసిరికొండ పవన్ కుమార్‌లి పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ యాదమ్మ& ఆంజనేయులు ఉపసర్పంచ్ కుసంగి రాములు గారు అలాగే వార్డు సభ్యులు సెక్రటరీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించే ందుకు డ్రెస్ కోడ్ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు..



# మరోమారు అనుష్క పెళ్లి వార్తలు

## పెళ్లి పీటలు ఎక్కనుందంటూ సోషల్ మీడియాలో హల్‌చల్

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్న ప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.




# 15న ఉస్తాద్ ప్రీరిలీజ్ వేడుకలు



పవన్‌కల్యాణ్ అభిమానులకు మరో శుభవార్త. పవన్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రీ-రిలీజ్‌వేడుక ఖరారైంది. మార్చి 15న హైదరాబాద్ పోలీస్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5గంటల నుంచి ఈవెంట్ మొదలవుతుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అలాగే దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఈసారి ఈవెంట్ బద్దలైపోవాలి ఫ్రెండ్స్' అని పేర్కొన్నారు. ఇక శనివారం సాయంత్రం 'ఉస్తాద్' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. రాశీఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత హరీశ్-పవన్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.

# నిర్మాతగా నేను పూర్తిగా నష్టపోయా : విజయ్ సేతుపతి

సాధారణంగా సినీ పరిశ్రమలో తమ వైఫల్యాలను దాచుకోవాలని చూసే వారు ఎక్కువగా ఉంటారు. కానీ తమిళ నటుడు విజయ్ సేతుపతి మాత్రం తాను నిర్మాతగా మారి తీసిన సినిమాలన్నీ నష్టాలనే మిగిల్చాయని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. కేవలం లాభాల కోసం కాకుండా, వైవిధ్యమైన కథల మీద ఉన్న మక్కువతోనే తాను సినిమాలు తీశానని ఆయన స్పష్టం చేశారు.నిర్మాతగా విజయ్ సేతుపతి తన ప్రయాణాన్ని 'సంగుతేవన్' అనే చిత్రంతో ప్రారంభించగా, అది మధ్యలోనే ఆగిపోవడంతో సుమారు రూ. 1.75 కోట్ల నష్టం వాటిల్లింది. ఆ తర్వాత ఆయన తన సొంత బ్యానర్‌పై నిర్మించిన ఆరెంజ్ మిఠాయి, మేర్కు తోడర్చి మలై, జుంగా, లాభమ్ వంటి చిత్రాలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఆయనకు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. అయినప్పటికీ, మనసుకు నచ్చిన కథలను వెండితెరకు పరిచయం చేశానన్న తృప్తి తనకు ఉందని, ఆ సినిమాల విషయంలో తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆయన చెప్పుకొచ్చారు.


నిర్మాతగా ఎదురైన ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూనే, ప్రస్తుతం ఆయన డిజిటల్ రంగంలోకి అడుగుపెట్టారు. విజయ్ సేతుపతి నిర్మాణంలో రూపుదిద్దుకున్న 'కాట్టాన్' అనే వెబ్ సిరీస్ త్వరలో డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో విడుదల కానుంది.



# 'రాకాసా' నుంచి 'పదే పదే' మెలోడీ..



టాలీవుడ్ యంగ్ క్యాస్టింగ్ సంగీత్ శోభన్, నయన్ సారిక లీడ్ రోల్స్ లో నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్టైనర్ మూవీ రాకాసా మూవీ రిలీజ్ కు సిద్ధమవుతోంది. మానసా శర్మ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను మెగా డాటర్ నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఆ సినిమాను సమర్పిస్తుండడం విశేషం. మరికొద్ది రోజుల్లో మూవీ రిలీజ్ కానుండగా.. మేకర్స్ ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కు సూపర్ రెస్పాన్స్ రాగా.. సినిమాపై ఆడియన్స్ లో మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయని చెప్పాలి. ఇప్పటికే మ్యూజిక్ ప్రమోషన్స్ లో భాగంగా ఫస్ట్ సింగిల్ ను విడుదల చేసిన మేకర్స్.. తాజాగా రెండో సింగిల్ పదే పదే అనే మెలోడీ పాటను తీసుకొచ్చారు. పదే పదే ప్రాణం నిన్నే కోరగా.. అంటూ సాగుతున్న ఆ పాటలో ప్రేమలో ఉండే స్వీట్ ఫీలింగ్స్ ను క్లియర్ గా చూపించారని చెప్పాలి. ప్రేమ మొదలయ్యే సమయంలో మనసులో కలిగే భావాలను పాటలో అందంగా ఆవిష్కరించారు. సాంగ్ కు కిట్టూ విస్సాప్రగడ సాహిత్యం అందించగా.. ఆయన ప్రేమలోని చిన్న చిన్న ఎమోషన్స్ ఈజీగా వ్యక్తం చేసేలా పదాలు రాశారు. సంగీత దర్శకుడు అనుదీప్ దేవ్ సాంగ్ కు సాఫ్ట్ మెలోడీ ట్యూన్ అందించారు. ముఖ్యంగా వీణ స్వరాలు ఆధారంగా తీసుకుని కంపోజ్ చేయగా.. అది పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోడ్రన్ మ్యూజిక్ కు సంప్రదాయ వాద్యాన్ని యాడ్ చేసి కంపోజ్ చేయడం వినడానికి ఎంతో ఆహ్లాదకరంగా మారింది. సాంగ్ ను సింగర్ సింధుజా శ్రీనివాసన్ ఆలపించగా.. ఆమె వాయిస్ పాటలోని ఎమోషన్స్ ను అందంగా వ్యక్తం చేస్తూ ఆకట్టుకుంటోంది.

# రాజ్ కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ

## ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వంలో రఫ్తార్

బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్'. ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనురాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# దురంధర్ మూవీ టేకింగ్ సూపర్బ్

## అందుకేనేమో ఆదిత్యధర్‌పై అందరికీ అసూయ

## రామ్‌గోపాల్ వర్మ సంచలన కామెంట్స్

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తన కామెంట్స్‌తో హాట్ టాపిక్‌గా మారారు. బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ ప్రతిభను ప్రశంసిస్తూనే, ఆయనపై ఇండస్ట్రీ అసూయ చూపిస్తుందంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్' సినిమా చూసిన తర్వాత తనకు ఆయనపై భారీ అభిమానం పెరిగిందని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. ఆ చిత్రంలోని మేకింగ్, టేకింగ్ తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. ఆదిత్య ధర్ తన ప్రత్యేక శైలితో సినిమా మేకింగ్‌ను పూర్తిగా కొత్త దిశలోకి తీసుకెళ్లారని వర్మ ప్రశంసించారు. అయితే ఇదే సమయంలో పరిశ్రమలో ఆయనపై అసూయ కూడా పెరుగుతోందని వర్మ వ్యాఖ్యానించారు. ఆదిత్య ధర్ తీసుకొచ్చిన కొత్త తరహా మేకింగ్ వల్ల పలు భారీ యాక్షన్ చిత్రాల టీమ్‌లు తమ సినిమాల షూటింగ్‌లను ఆపేసి రీ-షూటింగ్ చేయాల్సి వస్తోందని చెప్పారు. దీంతో కొందరు నిర్మాతలు నష్టపోతున్నారని, అందుకే ఆదిత్య ధర్ ,ఆయన భార్య యామీ గౌతమ్ పతనం కోసం కొందరు వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. రామ్ గోపాల్ వర్మ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో కూడా విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

